ప్రజాశక్తి

శనివారం 11 నవంబర్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

డెల్టాకు పొంచి ఉన్న నీటి ఎద్దడి

- రబీ సాగుపై వీడని గందరగోళం
- పులిచింతలలో భారీగా తగ్గిన నీటి నిల్వ
- పట్టిసీమ నుంచి ఆరువేల క్యూసెక్కులు రాక



ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కృష్ణా డెల్టాకు నీటి ఎద్దడి మరింత పెరగనుంది. ఇటీవల రెండ్రోజులపాటు కురిసిన వర్షాలతో వరి పైరు కొంతవరకు నిలదొక్కుకున్నా మరో తడికి నీరు కావాలంటే కాల్వలకు విడుదల చేస్తారో చేయరో తెలియడం లేదు. ప్రధానంగా పులిచింతల జలాశయంలో నీటి నిల్వ భారీగా తగ్గిపోయింది.

పులిచింతల జలాశయం గరిష్టనీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా శుక్రవారం సాయంత్రంకు 15.06 టిఎంసిల నీటి నిల్వ ఉంది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 800 క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లో 3200 క్యూసెక్కులే విడుదల చేస్తున్నారు. ఇంకా 5 టిఎంసిల వరకు వరి సాగుకు నీరు ఇవ్వాల్సి ఉందని, మిగతా 10 టిఎంసిలు రానున్న ఆరు నెలల్లో తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఖరీఫ్ తరువాత రబీ సాగుకు నీటిని ఇవ్వలేమని అధికారులు ముందే చెబుతున్న నేపథ్యంలో ఇప్పటి వరకు ఏ పంటలు వేయని దాదాపు 95 వేల ఎకరాల్లో రబీ పంటలు వేయడానికి కూడా రైతులు సాహసం చేయడం లేదు. గత నెల రోజుల్లో కేవలం 3 వేల ఎకరాల్లోనే అపరాల సాగైనట్లు అధికారులు తెలిపారు.

గతేడాది పులిచింతలలో ఇదే సమయానికి 38 టిఎంసిల నీరు నిల్వ ఉండగా ఈ ఏడాది ఎగువ నుంచి ప్రవాహం లేకపోవడం వల్ల పూర్తి తగ్గింది. అంతేగాక సాగర్, శ్రీశైలంలో కూడా నీటి నిల్వ పెరగడం లేదు. సాగర్ జలాశయంలో గరిష్టనీటి నిల్వ 312.04 టిఎంసిలు కాగా 157 టిఎంసిల నిల్వ ఉంది. సాగర్‌లో గతేడాది ఇదేరోజుకు 300 టిసిఎంల నీరు నిల్వ ఉండగా ఈ ఏడాది సగానికి తగ్గిపోయింది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం వల్ల కృష్ణా డెల్టాలో ఏర్పడిన సాగునీటి సంక్షోభం నుంచి కొంత ఉపశమనం పొందేందుకు ఒకవైపు పులిచింతల, మరోవైపు పట్టిసీమ పథకాలను ఉపయోగించుకున్నారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజి నుంచి 9 వేల క్యూసెక్కులు తూర్పు,పశ్చిమ డెల్టాకు విడుదల చేస్తున్నారు. పట్టిసీమ నుంచి దాదాపు ఆరువేల క్యూసెక్కులు వస్తున్నాయి. పులిచింతలలో నీటి నిల్వ పూర్తిగా తగ్గడం, వర్షాభావం వల్ల రబీ పంటలకు సాగు నీరు లభ్యమయ్యే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు.

పశ్చిమ డెల్టా పరిధిలో నాలుగు లక్షల ఎకరాల్లో వరి సాగవగా రెండో పంటగా రబీ పంటలైన జొన్న, మొక్కజొన్న సాగుకు రైతులు సమాయత్తం అయ్యేందుకు నీటి సరఫరాపై అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 4 లక్షల ఎకరాల్లో వరి సాగవగా ఇందులో చివరి భూములకు నీరందక రెండు లక్షల ఎకరాల్లో వరిపైరు బెట్టకు వచ్చిన పరిస్థితిలో ఇటీవల కురిసిన వర్షాలతో కొంత మేరకు తాత్కాలిక ఉపశమనం కలిగింది. అయితే ఇటీవల ఉపరితల ద్రోణి వల్ల రెండు రోజులపాటు ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసినా ఆగస్టు, సెప్టెంబరులో సాగు చేసిన వారికి ప్రస్తుతం నీటి అవసరం పెరుగుతోంది. మరో పక్షం రోజులు వర్షం కురవకపోతే తిరిగి కొన్ని ప్రాంతాల్లో వరికి ఇబ్బంది తప్పదు.



నరసరావుపేటలో కొవ్వొత్తులు ప్రదర్శిస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

పాలస్తీనాకు సంఘీభావం

ఇజ్రాయిల్ మారణకాండకు ఖండన - యుద్ధాన్ని ఆపాలని డిమాండ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మా దేశానికి హద్దులు ప్రకటించండి.. మా పై దాడులు నివారించండి.. మమ్ములను స్వేచ్ఛగా బతకనివ్వండి.. అని పాలస్తీనా వేడుకుంటుంటే వాటికి మతం రంగు పులిమి విద్వేషాలను బిజెపి రెచ్చగొడుతోందని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ విమర్శించారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను వెంటనే ఆపాలని, దీనిపై ప్రధాని మోడీ మౌనం వీడి పాలస్తీనాకు సంఘీభావం తెలపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద పాలస్తీనాకు సంఘీభావంగా రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించడంతోపాటు కొవ్వొత్తులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాగ్రమణను భారతదేశం తొలినుండీ వ్యతిరేకిస్తోందని, పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిలిచిందని గుర్తు చేశారు. అయితే తాజాగా హమాస్ దాడులను సాకుగా చేసుకుని

▶ 2లో

దుగ్గిరాలలో ప్రదర్శన



గొట్టిపాడుకు ఉన్నతాధికారులు

2018 నాటి ఘటనలపై విచారణ - పిటీషనర్ల నుండి వివరాల నమోదు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని గొట్టిపాడులో 2018 జనవరి 1న గ్రామంలో తలెత్తిన ఘర్షణలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి బాధిత దళితులు ప్రభుత్వం నుండి పరిహారం కోసం హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేయడంతో విచారణకు కోర్టు ఆదేశించింది. దీంతో జిల్లా ఎస్పీ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, రేజీ ఐజి, జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ అయిన జి.పాలరాజు, ఆర్డీవో పి.శ్రీఖర్ కలిసి గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. అనంతరం పిటిషన్ దాఖలు చేసిన వారితో ప్రత్తిపాడులోని తహశీల్దార్ కార్యాలయ

▶ 2లో



తహశీల్దార్ కార్యాలయం వద్ద సమావేశంలో వివరాలు చెబుతున్న స్థానికులు



పార్కులో ఏర్పాటు చేసిన గాంధీజీ చిత్రం వద్ద నివాళులర్పిస్తున్న రామకృష్ణారెడ్డి తదితరులు

నగరాల్లో ఆహ్లాదం పెంచేందుకు కృషి

రూ.6.25 కోట్లతో ఆధునీకరించిన గాంధీపార్కు పున:ప్రారంభంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్రంలోని నగరాలన్నింటిలో ఆహ్లాదకరమైన పార్కులను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకష్ణారెడ్డి అన్నారు. మార్కెట్ సెంటర్లోని గాంధీ పార్కును రూ.6.25 కోట్లతో అభివృద్ధి చేయగా దాన్ని సజ్జల రామకృష్ణారెడ్డి శుక్రవారం పున:ప్రారంభించి మాట్లాడారు. మానసిక ఒత్తిడి, వాతావరణ కాలుష్యం నుండి పచ్చదనం ప్రశాంతతని అందించడంలో పార్కులు ప్రధాన పాత్ర పోషిస్తాయని, గాంధీ పార్క్

▶ 2లో

15న మాచర్లకు ముఖ్యమంత్రి

- వరికపూడిశెలకు శంకుస్థాపన చేయనున్న సిఎం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, ప్రభుత్వ విప్

ప్రజాశక్తి - మాచర్ల

పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలో వరికపూడిశెల ఎత్తిపోల పథకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 15న శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. సాగర్ రహదారిలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో హెలిపాడ్ ఏర్పాటుకు, గుంటూరు రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు సమీపంలో ఉన్న పొలాల్లో సభ నిర్వహణకు స్థలాలను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ హాలులో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.చినఏసోబు, మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు, మాజీ చైర్మన్లు టి.కిషోర్, బి.రఘురామిరెడ్డి, నాయకులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తెనాలి అభ్యర్థిని టిడిపి-జనసేన కలిసే నిర్ణయిస్తాయి

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - కొల్లిపర : వైసిపి పాలన పట్ల ప్రజలు విసిగిపోయారని, వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ టిడిపి-జనసేన కలిసి పోటీ చేస్తాయని, టిడిపిని అధికారంలోకి తేవడానికి కలిసికట్టుగా పోరాడాలని అన్నారు. తెనాలి నియోజకవర్గ అభ్యర్థిని రెండు పార్టీలు కలిసే నిర్ణయిస్తాయని, దానికనుగుణంగా పని చేయాలని చెప్పారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు బి.చిన్నకోటిరెడ్డి, నాయకులు వి.సాంబిరెడ్డి, జి.గోవర్ధన్‌రెడ్డి, కె.కోటిరెడ్డి, పి.జోగేంద్ర పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు నెలాఖరుకు పూర్తిచేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : నగర పరిధిలోని ప్రధాన రోడ్లకు మరమ్మతులకు ఏఈల వారిగా ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ అధికారులతో జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ శుక్రవారం సమీక్షించారు. అనేక ప్రాంతాల్లో రోడ్లు గోతులు పడి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిలో కొన్ని జిఎంసి రోడ్లు, మరికొన్ని ఆర్అండ్‌బికి చెందినవి ఉన్నాయని అన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోను నెలాఖరు నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. వార్డు సచివాలయం పరిధిలో రెసిడెన్షియల్, కమర్షియల్ వాటర్ ట్యాప్ కనెక్షన్‌పై అడ్మిన్, ఎమినిటి కార్యదర్శులు సంయుక్త పరిశీలన చేసి, వారం రోజుల్లో రాతపూర్వక నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నివేదిక మేరకు క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తామని చెప్పారు. ప్రతి ఇంజినీరింగ్ అధికారి వాటర్ బైలాపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో ఎస్ఇ భాస్కర్, ఇఇలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాస్, హౌసింగ్ ఇఇ శంకరరావు, నగరపాలక సంస్థ, హౌసింగ్ డిఇఇలు, ఎఇలు మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - తెనాలి : రైతు సంక్షేమానికి, మార్కెట్ యార్డుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు చైర్పర్సన్ అవుతు సీత నగేష్‌తో కలిసి ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. యార్డు ముఖద్వారంలో ఎడ్ల బండితో రైతు ఉండే శిల్పం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. యార్డు కార్యదర్శి జెవి సుబ్బారావు, వైస్ చైర్మన్ వి.కృష్ణ, డైరెక్టర్ ఎ.సాంబశివరావు పాల్గొన్నారు.

పాదయాత్ర హామీలకు పాతర : టిడిపి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి : సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలకు పాతర వేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్ విమర్శించారు. శుక్రవారం ఆయన టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలను తగ్గిస్తామని హామీ ఇచ్చిన జగన్ నాలుగున్నరేళ్లలో ఏడు సార్లు కరెంటు ఛార్జీలను పెంచారని అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే ఆస్తులు అటాచ్ చేస్తామని సిఐడి అనడం దారుణమన్నారు. ప్రతిపక్ష నాయకులకు వ్యతిరేకంగా కేసులు పెడుతున్నారని ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు. పార్టీ కార్యక్రమాలకు కూడా ప్రభుత్వ అధికారులను, ఉద్యోగులను వినియోగించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజామాష్టారు మాట్లాడుతూ ఎపి హేట్ జగన్ అని ప్రజలు నినదిస్తుంటే కొద్దిమంది అధికారులు బాధ్యతారాహిత్యంగా వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొనడం తగదన్నారు. టిడిపి పాలనలో ఉద్యోగస్తులకు ప్రతినెలా 1వ తేదీన జీతాలు జమయ్యేవని, జగన్ పాలనలో వాటికోసం ఎదురుచూడాల్సి వస్తోందని అన్నారు. కార్యక్రమంలో కె.శివరామయ్య, డి.శ్రీనివాసరావు, ఎన్.ఓంకార్, బి.రామారావు, వి.ఏడుకొండలు, పి.సుందరంబాబు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజం ముందుకు

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఘన నివాలులు



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

ప్రజాశక్తి-గుంటూరు

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆలిండియా మిల్లీ కౌన్సిల్ ప్రెసిడెంట్ ముఫ్తీ అబ్దుల్ ఆసిఫ్ నద్వీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని, అలాంటప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని అన్నారు. లౌకికవాద భావాలున్న మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎమ్‌డి ఖాసిం మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో విద్యావ్యవస్థలో ఎన్నో సంస్కరణ చేపట్టిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ది అన్నారు. ప్రతి ఒక్కరు విద్యావంతులైనప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి. విజయలక్ష్మి , ఆలిండియా మిల్లీ కౌన్సిల్ గుంటూరు జిల్లా శాఖ సెక్రెటరీ అబ్దుల్ ఖవీ రాషదీ, సెక్రెటరీ అబ్దుల్ జాఫర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విద్య విభాగం, ఉర్దూ విభాగం, మైనార్టీ విభాగం సంయుక్తంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని, మైనార్టీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. విసి ప్రొఫెసర్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజు ప్రాముఖ్యతను వివిధ విద్యావేత్తలు, విద్యా విధానాల గురించి చెప్పారు. సమాజం బాగుండాలంటే పర్యావరణం సంరక్షణ ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి విభాగాధిపతి డాక్టర్ పి.బ్రహ్మజీరావు అధ్యక్షత వహించగా విద్యా విభాగం బిఒఎస్ చైర్మన్ డాక్టర్ ప్రియదర్శిని, వర్సిటీ మైనార్టీ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ తౌసిఫ్ అహ్మద్, డాక్టర్ సందీప్, డాక్టర్ శివరామిరెడ్డి, ఇంజనీర్ కుమార్ రాజా, డాక్టర్ ఎం.వసంతరావు పాల్గొన్నారు.



నగరాల్లో ఆహ్లాదం పెంచేందుకు కృషి

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి ద్వారా గుంటూరు నగర ప్రజలకు ఆహ్లాదం అందేలా నగరపాలక సంస్థ చర్యలు తీసుకుందని అన్నారు. గాంధీ పార్క్ పిల్లలను ఆకర్షించేలా స్ప్లాష్ ప్యాడ్, జంగిల్ బుక్, వెస్ట్ టు వండర్, గుంటూరు ఎక్స్‌ప్రెస్ టాయ్ ట్రైన్, చెస్ బోర్డ్, జీబ్రాలు, జిరాఫీల నమూన ప్రదర్శనశాల, బటర్ ఫ్లై జోన్‌లు, అందర్నీ అలరించేలా సెల్ఫీ పాయింట్స్, సీటింగ్ ప్లాజాలు, పార్టీలాన్, ఓపెన్ జిమ్‌లతో నగరానికి నూతన శోభను తెస్తుందని చెప్పారు. మారుతున్న కాలానికి తగిన విధంగా పిల్లలకు ఎడ్యుకేటివ్‌గా పార్క్‌ను తీర్చిదిద్దారన్నారు. రాష్ట్రంలోని అన్ని నగరాల్లో వాకింగ్ ట్రాక్‌లు, పార్క్‌లు అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ రక్షణ, నగర వాతావరణంలో ఆక్సిజన్ శాతాన్ని పెంచడానికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నట్లు చెప్పారు. మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో అభివృద్ధిలో గుంటూరు నగరం ముందు పీఠిన ఉంటుందన్నారు. అన్ని వయస్సుల వారు ఆనందించేలా తీర్చిదిద్దిన గాంధీ పార్క్‌ను నగర



ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపి అయోధ్యరామిరెడ్డి, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యేలు మహ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్, డిప్యూటీ మేయర్లు వి.బాలవజ్రబాబు, షేక్ సజిలా, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్, జిడిసిసి బ్యాంక్ చైర్మన్ రామాంజనేయులు, జిఎంసి ఎస్ఇ భాస్కర్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, వెంకటకృష్ణయ్య, ఎంహెచ్ఒ భానుప్రకాష్ పాల్గొన్నారు.



బహుమతులు అందచేస్తున్న అధికారులు

ముగిసిన ఎలక్ట్రిసిటీ టెన్నిస్, క్యారమ్స్ టోర్నీ

ప్రజాశక్తి-గుంటూరు : ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్స్ ఇండర్ సర్కిల్ టేబుల్ టెన్నిస్, క్యారమ్స్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం స్థానిక సంగడిగుంటలోని విద్యుత్ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఎస్ఇ ఎ.మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎపిసిపిడిసిఎల్ టెక్నికల్ డైరెక్టర్ బి.జయభారత్‌రావు, సిఆర్‌డిఎ ఎస్ఇ విజయ్‌కుమార్, ఎస్ఎఒ సుబ్బారావు, డిఇలు శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసబాబు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. టేబుల్ టెన్నిస్ టీమ్ ఈవెంట్‌లో గుంటూరు, కృష్ణపట్నం, విటిపిఎస్ జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. టేబుల్ టెన్నిస్ ఓపెన్ డబుల్స్‌లో మొదటి బహుమతి లక్ష్మణ్-భూపతి, రెండో స్థానంలో సుధీర్-మహేష్, మూడోస్థానంలో ఆదినారాయణ-రఫి నిలిచారు. క్యారమ్స్ టీమ్ ఈవెంట్‌లో నెల్లూరు, విశాఖపట్నం, గుంటూరు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఓపెన్ సింగిల్స్‌లో విజయ్, నాగేంద్ర, వీరాంజనేయులు మొదటి మూడు స్థానాలు సాధించారు. గుంటూరుకు చెందిన పి.వి.సుధీర్ బెస్ట్ ప్లేయర్ అవార్డు అందుకున్నారు.

పల్లెకుపోదాంలో ఎమ్మెల్యే రోశయ్య

ప్రజాశక్తి-చేబ్రోలు : చేబ్రోలులో శుక్రవారం నిర్వహించిన పల్లెకుపోదాం కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఇదే పాలన కొనసాగాలంటే మళ్లీ వైసిపినే గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా క్లాప్ స్వచ్ఛంధ్ర క్లాత్ మిత్రులకు, ప్రజలకు తడి-పొడి చెత్త డస్ట్ బిన్నులను పంపిణీ చేశారు. ఎంపిడిఒ బి.బాబురావు, తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొట్టిపాడుకు ఉన్నతాధికారులు

(మొదటి పేజీ తరువాయి)

అవరణలో సమావేశమయ్యారు. వారి నుండి వివరాలు తెలుసుకుని రికార్డు చేయడంతోపాటు రాతపూర్వక వాగ్మూలాలనూ తీసుకున్నారు. అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ విచారణకు పిటీషనర్లందరూ దాదాపు హాజరయ్యారని, వారి చెప్పిన అంశాలన్నింటినీ పరిశీలిస్తామని చెప్పారు. ఘటనలు జరిగినప్పుడు తీసుకున్న చర్యలనూ పరిగణలోకి తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు సుప్రజ, కె.కోటేశ్వరరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు , తహశీల్దార్ సిద్ధార్థ, ఎంపిడిఒ శ్రీరమ్య పాల్గొన్నారు.

పాలస్తీనాకు సంఘీభావం

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశం తన వైఖరిలో మార్పును ప్రదర్శించిందని అన్నారు. ఈ విషయంలో దేశ ప్రజలను మతోన్మాద బిజెపి ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం, ఆ పార్టీ శ్రేణులు తప్పుదోవ పట్టించాయని విమర్శించారు. పాలస్తీనాపై 25 రోజులుగా సాగుతున్న మారణకాండలో అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటికే 10 వేల మంది చనిపోయారని, శిధిలాల కింద ఎంత మంది ఉన్నారో తెలియడం లేదని, గాజాను వదిలి 6 లక్షల మందికి పైగా వెళ్లిపోగా మరో 8 లక్షల మంది ఎక్కడున్నారో కూడా తెలియన దయనీయ పరిస్థితి నెలకొందని ఆవేదన వెలిబుచ్చారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ దాడులను ఖండించాలన్నారు.యుద్ధాన్ని ఆపేయాలనే ఐక్యరాజ్య సమితి, ఇతర ప్రపంచ దేశాల విజ్ఞప్తినీ ఇజ్రాయిల్ లెక్క చేయడం లేదని, వీరికి అమెరికా మద్దతుగా నిలుస్తోందని దుయ్యబట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ 56 ఏళ్లుగా పాలస్తీనా ప్రాంతంలో అణచివేత జరుగుతోందన్నారు. కాల్పుల విరమణ ప్రకటించి పాలస్తీనాకు సాయం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు డి.శివకుమారి, పట్టణ కార్యదర్శి షేక్ సిలార్ మసూద్, నాయకులు ఇ.మస్తాన్‌రెడ్డి, కె.ఆంజనేయులు, సయ్యద్ రబ్బాని, కె.హనుమంత్‌రెడ్డి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు కె.ఏడుకొండలు, స్వరూప్, కె.వెంకయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల కేంద్రమైన దుగ్గిరాలలో వామపక్ష, ఇతర పార్టీల ఆధ్వర్యంలో పాలస్తీనాకు సంఘీభావ ప్రదర్శన చేశారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు మాట్లాడుతూ పాలస్తీనా ప్రజల ఊచకోతకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌కు భారత ప్రభుత్వం మద్దతు పలకటం దారుణమన్నారు. ఇది ప్రధాని నరేంద్రమోడీ యుద్ధోన్మాదానికి నిదర్శనమని విమర్శించారు. మోడీ గుజరాత్ సిఎంగా ఉన్నప్పుడు వేలాది మంది ముస్లిమ్ మైనార్టీలను చంపేశారని, ఇప్పుడు మణిపూర్ రాష్ట్రంలో క్రిస్టియన్లపై దాడులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా భారత ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు మద్దతును ఉపసంహరించుకుని పాలస్తీనా ప్రజలను ఆదుకోవడానికి, అక్కడ శాంతి నెలకొనేందుకు కృషి చేయాలని కోరారు. సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు లోకం భాస్కర్‌రావు మాట్లాడుతూ పాలిస్తీనా ప్రజలను ఆదుకోవడానికి అన్ని దేశాలు ముందుకు రావాలన్నారు. వైసిపి మైనార్టీ సెల్ జిల్లా నాయకులు ఎస్కే. సుభాని మాట్లాడుతూ పాలిస్తీనాలో జరుగుతున్నది రెండు మతాల మధ్య గొడవ కాదని జాతుల మధ్య గొడవని అన్నారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి జె.బాలరాజు, సిపిఐ నాయకులు వై.శివయ్య, ఉపసర్పంచ్ ఎస్.కె నాగూర్ బాష మాట్లాడారు. సిపిఎం నాయకులు వై.బ్రహ్మేశ్వరరావు, ఎన్.యోగేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు కె.కోటేశ్వరరావు, టిడిపి నాయకులు బాష, జాన్ బి, హజీరా, ముక్తార్ మున్నిసా, కరీమున్నిసా పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు
3
శనివారం 11 నవంబర్ 2023

ఆగి ఉన్న లారీల్లో డీజిల్ చోరీ

- అయ్యప్ప మాలదారుల వేషధారణలో ముగ్గురు నిందితులు
- పట్టుబడ్డ ఒకరు.. పరారీలో ఇద్దరు : నరసరావుపేట రూరల్ సిఐ

ప్రజాశక్తి-రొంపిచర్ల

హైవేలపై ఆగి ఉన్న లారీల నుంచి డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితుల్లో ఒకరు పట్టుబడినట్టు నరసరావుపేట రూరల్ సిఐ ఆర్. కృష్ణయ్య చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. క్రోసూరు మండలం యర్రబాలెంకు చెందిన తాతారావు పొలం కౌలుకు తీసు కొని సాగు చేసుకుంటూ జీవనం సాగి స్తున్నాడు. ఈ క్రమంలో అతను పేకాట, మద్యపానం, కష్టపడకుండా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో ఉన్న అతను చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నాడు.

హైవేలపై ఆగి ఉన్న లారీల నుండి పైప్ ద్వారా డీజిల్ దొంగ తనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో అతను తన కుటుంబాన్ని తన స్వగ్రామం నుండి అమరావతి మండలం మునుగోడుకి మార్చినట్లు చెప్పారు. ఆ గ్రామంలోని మద్యం షాపులో ఇదే కోవకు చెందిన గ్రామస్థులు కొలికొండ వెంక ట్రావు, కోనంకి వెంకటశివరామ్ లు తాతా రావుకు పరిచయమయ్యారు. ఈ ముగ్గు రూ కలిసి రాత్రివేళల్లో కారులో తిరుగుతూ హైవేలపై ఆగి ఉన్న లారీల నుండి పైప్‌ల ద్వారా డీజిల్ దొంగతనాలకు పాల్పడు తున్నారు. తెలుగు భాష మాట్లాడే వారిని కాకుండా ఇతర భాషలు మాట్లాడే వారి లారీల నుండి డీజిల్ దొంగతనాలకు పాల్పడుతుంటారు. తెలుగు మాట్లాడలేని వారైతే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయరని ఉద్దేశ్యంతో ఈ విధంగా చేస్తున్నారు. ఈ నెల 5న మండలంలో మద్రిచెట్టుపాలెం లోని హైవే రోడ్డు పై రాత్రి సమయంలో రాజుల అంజిరెడ్డి కి చెందిన లారీ ఆగి ఉంది. ఈ ముగ్గురు అయ్యప్ప మాలదారుల వేషధారణలో ఉండి లారీలో నుండి పైప్ ద్వారా డీజిల్ తీస్తున్నారు. దీంతో, అను మానం వచ్చి లారీ డ్రైవర్ అంజిరెడ్డి చూసి కేకలు వేయడంతో వారు కారులో పరారయ్యారు. అనంతరం లారీ డ్రైవర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు శుక్రవారం సుబ్బయ్యపాలెం హైవే రోడ్లపై వాహనాలు తనిఖీ చేసే క్రమంలో అయ్యప్ప మాలదారుల వేష ధారణలో కారులో వెళుతున్న వీరిపై అనుమానం వచ్చింది.



కారు ఆపడంతో తాతారావు పోలీసులకు పట్టుబడ్డాడు. మిగిలిన ఇద్దరు పరారయ్యారు. తాతారావును అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించామని, పరారీలో ఉన్న ఇద్దరిని కూడా పట్టుకుంటా మని అన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ ఐ. కె.పి. రవీంద్ర, పోలీసులు పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయండి



గఫూర్‌కు వినతిపత్రం అందిస్తున్న రజకులు

ప్రజాశక్తి-తాడేపల్లి

రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య వచ్చి 76 ఏళ్ల గడిచినా రాష్ట్రంలో ఏదో ఒకచోట దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. చెరువులు, కుంటలు, కమ్యూనిటీ హాలు నిర్మాణ స్థలాలను అగ్ర వర్ణ పెత్తందారులు వారి వ్యాపార వ్యక్తిగత అవసరాలకు స్వాధీన పరుచుకుంటున్నారని మండిపడ్డారు. రజకులన తమ వృత్తి నుంచి దూరం చేస్తున్నారని ఆరోపించారు. 50 సంవత్సరాల నిండిన ప్రతి రజకుడికి వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు గురువారం రాత్రి ఉండవల్లికి చేరిన సిపిఎం ప్రజా రక్షణభేరి బస్సుయాత్ర నాయకులు ఎంఎ గఫూర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బి.సుబ్బారావు, బి.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, బి.మస్తానరావు, యు.పార్ధసారధి, పి.శివయ్య, ఎం.బాబూరావు పాల్గొన్నారు.

ప్రజారక్షణభేరీ మహాసభను జయప్రదం చేయండి



ఈ నెల 15వ తేదీ విజయవాడలో జరిగే సిపిఎం ప్రజా రక్షణభేరి మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో నాలుగు టీమ్‌లుగా ఏర్పడి సిపిఎం కార్యకర్తలు వాల్‌పోస్టర్లు అంటిస్తున్నారు. మహాసభకు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో కొట్టె కరుణా కరరావు, కొండబాబు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరణ

విజయవాడలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, కొట్టె కరుణాకరరావు, కె.బాబూరావు, కె.మేరి, డివి భాస్కరరెడ్డి, బి.గోపాల్‌రెడ్డి, కె.వెంకటయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మేడికొండూరు

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. మండలంలోని విశదలకి చెందిన టి.ఇమ్మానియేల్ బైక్ మెకానిక్ గా పేరేచర్ల లో పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం రాత్రి పేరేచర్ల నుండి విశదలకు వెళుతుండగా మార్గమధ్యంలో హరియాలి సమీపంలోని బ్రిక్స్ కంపెనీ వద్ద ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇమ్మానియేల్ కు తీవ్ర గాయాలవడంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్యాపిల్లలు ఉన్నారు. మేడికొండూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లోడు లారీ బోల్తా

ప్రజాశక్తి-యడ్లపాడు

పదహారవ నంబరు జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు లోడు లారీ బోల్తా పడింది. రాయపూర్ నుంచి చెన్నైకు కరెంటు సామాగ్రి లోడుతో లారీ యడ్లపాడు సినిమా హాలు వద్దకు రాగానే డివైడర్‌ను ఢీ కొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ పాక్షికంగా దెబ్బతింది. అందులోని సామాగ్రి రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి డ్రైవర్,క్లీనర్లు సురక్షితంగా బయటపడ్డారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని అరవింద స్కూల్ రోడ్డు ఏరియా, శుభమస్తు ఫంక్షన్ హాలు, ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిఇ ఎ.సత్యనారాయణ, ఎఇ నాగ మల్లేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 16,744
మిర్చి ఎగుమతి	: 19,321
మిర్చి నిల్వ	: 7,160

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,700 - 22,500
నెం.5	14,000 - 17,000
273	16,500 - 18,500
341	13,000 - 20,500
సూపర్ 10	18,500 - 23,000
	నాన్ ఏసి
తేజ	8,500 - 24,100
బడిగి	9,000 - 24,000
దేవనూరు డీలక్స్	13,000 - 20,000
తాలుకాయలు	6,000 -14,000
	ఏసి
334	15,000 - 21,300
341	15,000 - 22,000
4884	15,000 - 19,000
తేజ	9,000 - 23,800
బడిగి	16,500 - 22,000
దేవనూరు డీలక్స్	13,000 -18,500
తాలుకాయలు	6,500 -11,500

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

సత్వర న్యాయం పొందేందుకు కక్షిదారులు లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకోవాలని పొన్నూరు మండల సేవాధికార సంస్థ చైర్మన్ , ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం సత్యకుమారి పేర్కొన్నారు. న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని పొన్నూరు సివిల్ జడ్జి కోర్టు హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్యకుమారి మాట్లాడారు. సివిల్ , క్రిమినల్ ఎం సి, తదితర కేసులను రాజీ చేసుకోవడం ద్వారా లోక్ అదాలత్ ల నందు సత్వర న్యాయం పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు అడ్వకేట్లు, మండల సేవాధికార సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



వృద్ధురాలిపై దాడి.. గొలుసు చోరీ

ప్రజాశక్తి-తాడేపల్లి



రాజధానిలో భాగమైన పెనుమాకలో ఓ వృద్ధురాలిపై దాడి చేసి రూ.2 లక్షలు విలువ చేసే బంగారాన్ని అపహరించుకుపోయారు. పట్టపగలే జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. తాడేపల్లి పోలీసుల కథనం ప్రకారం... బొడ్డురాయి సెంటర్‌లో నివాసం ఉంటున్న కళ్లం సుబ్బమ్మ ఇంట్లోకి బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు చొరబడ్డారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమెపై దొంగలు హెల్మెట్‌తో తలపై దాడి చేసి గాయపరిచారు. ఆమె మెడలోని రూ.2 లక్షలు విలువ చేసే నాలుగు కాసుల బంగారు గొలుసును తెంచుకుని బండిపై పారిపోయారు. తాడేపల్లి ఎస్ఐ వినోద్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలి భర్త బ్రహ్మారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బడ్డీ కొట్లో దొంగతనం

ప్రజాశక్తి-తాడేపల్లి

మహానాడులోని పట్టాభి సీతారామయ్య కాలనీ ఒకటో రోడ్డులో సిహెచ్. వెంకటేశ్వర్లుకు చెందిన బడ్డీ కొట్లో దొంగతనం జరిగింది. దొంగలు బడ్డీ కొట్టు పగుల కొట్టి రూ.20 వేలు నగదుతో పాటు సిగరెట్లు ఎత్తుకుపోయారు. బాధితులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రేపటి నుంచి తిరునక్షత్ర మహోత్సవం

ప్రజాశక్తి-తాడేపల్లి

సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో చినజీయర్‌స్వామి తిరునక్షత్ర మహోత్సవం 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరగనుందని నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి విజయకీలాద్రిపై వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.



పల్నాడు డిఇఒ శామ్యూల్ నుండి ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థినులు చంద్ర వెంకటలక్ష్మి, స్వాతి

రాష్ట్రస్థాయికి బొగ్గరం విద్యార్థినుల ప్రాజెక్టు

ప్రజాశక్తి-ఈపూరు

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన 31వ బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో ఈపూరు మండలం బొగ్గరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎర్రబోతుల చంద్ర వెంకటలక్ష్మి, బండారు స్వాతి రూపొందించిన 'మెన్‌స్టర్ కప్స్' ప్రాజెక్టు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైనట్లు హెచ్ఎం సిహెచ్ వీరప్పయ్య తెలిపారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు చెప్పారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ నుండి ప్రశసా పత్రాలు అందుకున్నారు. విద్యార్థినుల ప్రాజెక్టుకు గైడ్‌గా వ్యవహరిస్తున్న టీచర్ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ శానిటరీ నాప్కిన్స్ వల్ల కలుగుతున్న అనారోగ్య సమస్యలు, పర్యావరణానికి జరుగుతున్న హానిని పరిగణలోకి తీసుకొని వాటి పరిష్కార మార్గం చూపించడంలో ప్రాజెక్ట్ విజయవంతమైనదన్నారు.

బాణసంచా విక్రయానికి అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - రెంటచింతల

దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయానికి వివిధ శాఖల నుంచి అనుమతి పత్రాలు తప్పనిసరిగా పొందాలని ఎస్సై శ్యామ్యూల్ రాజీవ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసు, రెవెన్యూ, ఫైర్, విద్యుత్ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాణసంచా కాల్చే సమయంలో చిన్న పిల్లలు జాగ్రత్తలు పాటించాలని, పిల్లలను పెద్దవారు నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. పండగ రోజు అన్ని గ్రామాల్లో నిఘా ఉంటుందన్నారు.

ఎన్నికల అధికారిగా డిఎల్‌డిఒ గబ్రు నాయక్

ప్రజాశక్తి - రెంటచింతల

వైస్ ఎంపిపిగా వ్యవహరిస్తున్న మంచికల్లు ఎంపిటిసి మాచర్ల అచ్చమ్మ అనారోగ్యం కారణంగా ఇటీవల రాజీనామా చేశారు. ఆ పదవికి నూతన వైఎస్ ఎంపిపిని ఈ నెల 16న ఎన్నుకోనున్నారు. ఈ క్రమంలో ఎన్నికల అధికారిగా డిఎల్‌డిఒ గబ్రునాయక్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. చేతులెత్తే పద్ధతి ద్వారా ఎన్నిక ఉంటుందని, అదేరోజు ప్రమాణస్వీకారం ఉంటుందని అధికారులు. ఇదిలా ఉండగా ఈ పదవికి రెంటచింతల-5 ఎంపిటిసి పి.సంపూర్ణమ్మను ఎన్నుకోనున్నట్లు తెలిసింది.

తుమ్మకోటలో 8 బోర్లకు రూ.16 లక్షలు

ప్రజాశక్తి- రెంటచింతల

మండలంలోని తుమ్మకోట గ్రామంలో తాగునీటి ఎద్దడి అధికంగా ఉండడంతో దాని నివారణకు వివిధ కాలనీలో 8 బోర్లు వేసినట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ బోర్లు ఏర్పాటుకు మండల పరిషత్ నిధులను కేటాయించినట్లు చెప్పారు. దీంతో ఆయా ప్రాంతాల్లో తాగునీటి కొరత తీరుతుందని అన్నారు. జిల్లా పరిషత్ నిధుల ద్వారా మరో నాలుగు బోర్లు వేయనున్నట్లు తెలిపారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని వెంటనే ఆపాలి

- నరమేధాన్ని ప్రపంచం మొత్తం ఖండించాలి
- సంఘీభావంగా పలుచోట్ల రౌండ్‌టేబుల్ సమావేశాల్లో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు



చిలకలూరిపేట సమావేశంలో మాట్లాడుతున్న బుడ్డిగ జమిందార్



సత్తెనపల్లి సమావేశంలో మాట్లాడుతున్న పి.మహేష్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని, పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పాలస్తీనా ప్రజల సంఘీభావ మిత్రుల ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్‌లోని సిపిఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. సభకు ప్రముఖ న్యాయవాది, సిపిఐ సీనియర్ నాయకులు ఆర్.వెంకటేశ్వరరావు (ఆర్‌వి) అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ బుడ్డిగ జమిందార్ మాట్లాడుతూ పాలస్తీనా ప్రాంతంలోని అపారమైన చమురు నిక్షేపాలపై ఆధిపత్యం కోసం ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతిస్తోందన్నారు. గాజా ప్రాంతానికి ఏమీ సరఫరా కాకుండా ఓపెన్ జైల్‌గా మార్చారని, అంతర్జాతీయ చట్టాలనూ ఇజ్రాయిల్ ఉల్లంఘించడంతోపాటు యుద్ధ నేరాలకూ పాల్పడుతోందని అన్నారు. యుద్ధాన్ని తక్షణం ఆపాలని ఐక్యరాజ్య సమితిలో 120 దేశాలు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా భారత్ గైర్హాజరవడం మోడీ హయాంలో మారిన భారత విదేశాంగ విధానానికి నిదర్శనమన్నారు. పాలస్తీనా వివాదానికి శాశ్వత పరిష్కారాన్ని కనుగొనేందుకు ఐక్యరాజ్య సమితి చొరవ తీసుకోవాలని, ఆ దేశానికి భారత్ అండగా నిలవాలని కోరారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ పాలస్తీనాలోని ఆస్పత్రులు, నివాసాలనూ వదలకుండా 3 లక్షల మంది సైన్యంతో ఇజ్రాయిల్ దాడులు అమానుషమన్నారు. నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ ఎక్కడ చూసినా శవాల గుట్టలు, పసిపిల్లల ఆర్తనాధాలతో గాజా ప్రాంతమంతా రోదనగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. 75 ఏండ్లుగా పాలస్తీనా భూభాగాన్ని అక్రమించుకుంటూ ఈ యుద్ధం ద్వారా ప్రపంచ పటం నుంచి పాలస్తీనా ఉనికి లేకుండా చేయాలనే సామ్రాజ్యవాద కుట్ర సాగుతోందన్నారు. సమావేశంలో వివిధ పార్టీలు, సంఘల నాయకులు ఎన్.శివకుమార్, బి.శంకరరావు, టి.ప్రతాప్‌రెడ్డి, ఎస్.బాబు, ఎన్.రామసుబ్బాయమ్మ, ఐ.జగదీష్, జరినా సుల్తానా, జమాల్‌బాష, ఎం.రాధాకృష్ణ, ఎన్.కోటేశ్వరరావు, టి.బాబురావు, సుభాని, రమేష్, గౌస్, భగత్‌సింగ్, ముత్తయ్య, అల్లాబక్షు, మోహన్‌రావు, శ్రీనునాయక్, జబ్బార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక పుతుంబాక భవన్‌లో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల అధ్యక్షత వహించారు. సిపిఎం సత్తెనపల్లి, ముప్పాళ్ల మండల కార్యదర్శులు పి.మహేష్, జి.బాలకృష్ణ, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.హరిపోతురాజు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణకాండకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. ఇప్పటికే 10 వేలకు మందికి పైగా పౌరులు ప్రాణాలు కోల్పోగా వీరిలో మహిళలు, చిన్నారులు అధికంగా ఉన్నారని చెప్పారు. దాదాపు 10 లక్షల మంది తమ ఇళ్లను వదిలి పారిపోయారని అన్నారు. ఈ యుద్ధంలో అమెరికా కిరాతక పాత్ర పోషిస్తోందని, ప్రజాస్వామ్యం, మానవ హక్కుల గురించి మాట్లాడే నైతిక హక్కును అమెరికా పూర్తిగా కోల్పోయిందని విమర్శించారు. అమెరికా ప్రతి సందర్భంలోను ఇజ్రాయిల్ అరాచకాలకు బాసటగా నిలిచిందని, యుద్ధకాంక్షను ప్రేరేపిస్తోందని మండిపడ్డారు. తక్షణమే కాల్పులు విరమణ పాటించి, శాంతి నెలకొల్పాలని, ప్రజలకు మానవతా సహాయం అందచేయాలని కోరారు. అయితే ఈ విషయంలో భారతదేశం ఐక్యరాజ్య సమితిలో వ్యవహరించిన తీరు సరికాదన్నారు. అలీనోద్యమ చరిత్ర ఉండి, గతంలో పాలస్తీనా హక్కుల కోసం నిలబడిన సందర్భాలను మరిచి ఇప్పుడు భిన్నమైన వైఖరిని ఐక్యరాజ్య సమితిలో ఇండియా తీసుకోవడం దేశ ప్రతిష్టకే మచ్చన్నారు. యుద్ధాన్ని తక్షణమే ఆపి, పాలస్తీనాను స్వతంత్రదేశంగా ప్రకటించేందుకు అవసరమైన చర్యలు తీసుకునేలా అంతర్జాతీయ సమాజం కృషి చేయాలని కోరారు. ఇందుకు ప్రపంచ మానవాళి నుండి స్పందన, ఒత్తిడి, సంఘీభావం పెద్దఎత్తున పెరగాలన్నారు. కార్యక్రమంలో పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పి.సూర్యప్రకాశరావు, కె.జగన్మోహన్ రావు, ఎస్.వెంకటేశ్వరరావులు, ఎ.వెంకట్ నారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



శాంతియుత ర్యాలీ

ప్రజాశక్తి పెదకూరపాడు

పాలస్తీనా గాజాలో ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న భీకర యుద్ధాన్ని నిరసిస్తూ పెదకూరపాడులో శుక్రవారం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ బస్టాండ్ సెంటర్ నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు జరిగింది. కమిటీ సభ్యులు మాట్లాడుతూ, పాలస్తీనా గాజాలో అమాయక ప్రజలు, పిల్లలు, మహిళలపై, వారి నివాసాలపై అతికిరాతకంగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని కోరారు. తహశీల్దార్ జియా కి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ముఫ్తీ మహమ్మద్ అస్రార్, ఖాసిం ఖాన్, నాయబ్ ముస్తఫా, దిలావర్, గఫూర్, ముంతాజ్, జానీ, కరిముల్లా, ముస్లిం సోదరులు, యువకులు పాల్గొన్నారు.


అమరావతిలో వైసిపి సామాజిక సాధికార యాత్ర

ప్రజాశక్తి - అమరావతి

వైసిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సాధికార యాత్రను అమరావతి మండలంలో శుక్రవారం నిర్వహించారు. యాత్రను ధరణికోట జెబి గార్డెన్ వద్ద రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ప్రారంభించగా అనంతరం అమరావతిలోని రథం సెంటర్‌లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయాలకు అతీతంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించడంతోపాటు వారికి రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారని, విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి ప్రతిఇంటికీ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. వైసిపిని 2024లోనూ అధికారంలోకి తీసుకురావడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. నియోజకవర్గాన్ని ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేసిన శంకరరావును మళ్లీ గెలిపించాలని కోరారు. రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుడు, సినీ నటుడు ఆలీ మాట్లాడుతూ జర్నలిస్టుల చిరకాల కోరికైన ఇళ్ల స్థలాల పంపిణీకి సిఎం శ్రీకారం చుట్టారన్నారు. గత ప్రభుత్వాలకంటే మెరుగ్గా ముస్లిమ్ మైనార్టీలను రాజకీయంగా వైసిపి ప్రభుత్వం అభివృద్ధి చేసిందని, వారంతా జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, నందిగాం సురేష్, బీదా మస్తాన్‌రావు, మోపిదేవి వెంకట రమణారావు, వైసిపి జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గుంటూరు జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాదరావు, నియోజకవర్గ పరిశీలకులు స్వామి నాయుడు పాల్గొన్నారు.



యాత్రలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, సభలో మాట్లాడుతున్న ఆలీ



ఒపిఎస్‌ను అమలు చేయాలని వినతి

సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని ఎపిసిపిఎస్ఇఎ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి పోలూరి పిచ్చయ్య, సలహాదారు టి.శరత్‌కుమార్ కోరారు. మండల కేంద్రమైన అమరావతిలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఒపిఎస్‌పై లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ ఇటీవల పనిగట్టుకుని విషం కక్కుతున్నారని విమర్శించారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెన్షన్ ప్రభుత్వాలకు భారం అనుకుంటే అది వృద్ధాప్యంలో తల్లిదండ్రులను రోడ్డుపై వదిలేయడం లాంటిదేనని అన్నారు.



రెండవ పిల్లల పండుగ బాలోత్సవ్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం రెండవ పిల్లల పండుగ డిసెంబర్ 19, 20 తేదీలలో ఎర్రబాలెం వద్ద గల డాన్‌బాస్కో హైస్కూల్లో జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరణ శుక్రవారం మంగళగిరిలోని వీ జె డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర విజ్ఞాన కేంద్రాల కన్వీనర్ పి మురళీకృష్ణ మాట్లాడుతూ బాలల్లో ఉన్న సజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు బాలోత్సవాలు ఉపయోగపడతాయని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో బాల బాలికల ఈ కార్యక్రమానికి 4,000 మంది హాజరు కానున్నారని, కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి అందరూ కృషి చేయాలని కోరారు. గౌరవాధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరావు, అధ్యక్షులు వివి ప్రసాద్ మాట్లాడుతూ అనేక వేలమంది విద్యార్థి విద్యార్థులతో బాలోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడానికి అన్ని రకాల ఏర్పాట్లు సిద్ధం చేసినట్లుగా తెలిపారు. కార్యదర్శి పి రాజశేఖర్ మాట్లాడుతూ బాలోత్సవంలో మంగళగిరి, దుగ్గిరాల, తాడేపల్లి, తుళ్లూరు మండలాల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, ప్రముఖ పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్, విశ్రాంత ప్రిన్సిపల్ ఎం విజయ మోహన్ రావు, అమరావతి ఐకాన్ అపార్ట్మెంట్స్ వై బాలకృష్ణ, మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు అందె రేవంత్, తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో రోగులకు ఉచిత భోజన వసతి

జిజిహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి



ప్రభుత్వ ఆసుపత్రి జగనన్న ఆరోగ్య సురక్ష సమాచార కేంద్రానికి వచ్చే రోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వైద్య సేవలు తో పాటు మధురాన్నం ఉచితంగా భోజన సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటె ండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష సమాచార సహాయ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కేంద్రానికి వస్తున్న రోగుల వివరాలను సేకరిస్తూ వారికీ అవసరమైన వైద్య పరీక్షలు చేస్తున్నామని డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సమాచార కేంద్రానికి రోగుల సంఖ్య పెరుగుతుండటంతో వారికీ అవసరమైన మధురాన్నం భోజన సౌకర్యం, మంచినీటి సౌకర్యాన్ని ఉచితంగా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు అయన చెప్పారు. గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల, నరసరావుపేట, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తున్నారని, ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు ఈ కేంద్రం లో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. రోగులు ఎక్కువ మంది వస్తుండటంతో సమయానికి భోజనం అందక ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఈ విషయాన్నీ మధురాన్నం నిర్వహకులు చెప్పడంతో వారు అంగీకరించారని ఆయన అన్నారు. ఈ సంస్థ అధ్యక్షులు, మాజీ మంత్రి చెరుకువాడ రంగనాథ రాజు కు ఈ సందర్భంగా ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. గత రెండేళ్ల నుంచి రోగులకు వారి సహాయకులకు రోజుకు 2000 మంది పైగా భోజనాలు పెడుతున్నారని అయన గుర్తు చేసారు. దానికి తోడుగా జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రానికి వచ్చే వారికీ కూడా భోజనం పెట్టేందుకు ముందుకు వచ్చారని అయన తెలిపారు. రోగులకు డబ్బులు లేక పోవడం వల్ల బయటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న వారికీ భోజన సౌకర్యం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ యమ ఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆస రోజని పాల్గొన్నారు.

వైసిపికి అడ్డాగా సచివాలయాలు : లక్ష్మణరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి



అధికారంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ, వార్డు సచివాలయాలను వైసిపి కార్యాలయాలుగా మార్చిందని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఆరోపించారు. శుక్రవారం గుంటూరులోని వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో జనచైతన్య వేదిక తోపాటు ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం ప్రధాన కార్యదర్శి పి.వి. మల్లికార్జునరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవిపి. మురళీ కృష్ణారావు, ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు వి. రాధాకృష్ణమూర్తి, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఒ. నారాయణరెడ్డి, సామాజిక ఉద్యమ కారులు ఏన్ బ్రమ్మయ్య పాల్గొని ప్రసంగించారు. వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే పార్టీ కార్యక్రమాన్ని అధికార యంత్రాంగంతో సచివాలయాలు కేంద్రంగా నిర్వహించడం భారతదేశ చరిత్రలో మొదటిసారి అన్నారు. రాష్ట్రంలో ఉన్న 2.66 లక్షల మంది వాలంటీర్లు, 15 వేల నాలుగు సచివాలయాల్లో పనిచేస్తున్న 1.3 లక్షల మంది సచివాలయ సిబ్బందిని అధికార పార్టీ కార్యక్రమం అయిన ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం సహేతుకం కాదని, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కలిసి రాబోవు ఎన్నికలలో రాజకీయ లబ్ది కోసం ప్రచారం చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్నట్లుగా భావించాలన్నారు. ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం ప్రధాన కార్యదర్శి పి.వి మల్లిఖార్జున రావు ప్రసంగిస్తూ ప్రజాధనంతో వాలంటీర్లు, సచివాలయ సిబ్బందికి వేతనాలు చెల్లిస్తూ పార్టీ కార్యక్రమాలకు వినియోగించడం సహేతుకం కాదన్నారు. సచివాలయం వద్ద వైసిపి జండాలు ఎగరవేయడం, బ్యానర్లు కట్టడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అన్నారు. మంత్రులే పలు సందర్భాలలో వాలంటిర్లందరూ వైకాపా కార్యకర్తలే నని బహిరంగంగా తెలపడాన్ని గుర్తుచేశారు. తప్పులతడకతో అవాస్తవాలతో రూపొందించిన 24పేజీల బుక్లెట్ ను వాలంటీర్లు తో ఇంటి ఇంటికి పంపిణీ చేసి ఎన్నికల లబ్ది కోసం తాపత్రయ పడుతున్నారని వివరించారు.

పశువుల కొనుగోలులో అక్రమాలు : దూళిపాళ్ల నరేంద్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



రాష్ట్రంలో పశువుల కొనుగోలులో భారీగా అక్రమాలు జరిగాయని మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర ఆరోపించారు. గుంటూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పశు సంవర్ధక శాఖ మంత్రి సిదిరి అప్పలరాజు అవినీతి పెరిగిపోయిందన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు పురుగులు పట్టిన టెట్రా ఫ్యాక్స్ పంపుతున్న సిదిరి అప్పలరాజుపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేయించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు అడ్డగోలుగా మింగి పలు అక్రమాలకుపాల్పడుతున్నారని అన్నారు. హెరిటేజ్ కంపెనీని రాష్ట్రానికి రాసివ్వాలని అప్పలరాజు మాట్లాడే మాటలు చూస్తే మతిభ్రమించిందేమో అనిపిస్తుందన్నారు. సంఘం డైరీ భూములు జలగం వెంగళరావు సమయంలో రైతుల చందాలతో కొన్నారన్న సంగతి తెలియక ఇష్టానుసారంగా మంత్రి మాట్లాడు తున్నారన్నారు. గేదెల కుంభకోణంలో కోట్లాది రూపాయలు వైసిపి నేతలు దోచుకున్నారని పశువుల కొనుగోళ్లు అనేది కాగితాల్లోనే ఉంది, రైతులకు చేరలేదు... మీకు దమ్ముంటే బెనిఫిషరి లిస్ట్ బహిర్గతం చెయ్యాలని డిమాండ్ చేశారు. భీమవరం గేదెల సంత వైసీపీ బినామిలాది కాదా అని ప్రశ్నించారు... రాష్ట్రంలో పశువుల కొనుగోలు విషయం భారీ కుంభకోణం అని.. ఈ కుంభకోణం రాష్ట్రం మొత్తం పాకిందని, అధికారపార్టీ నేతలు భారీ అవకతవకలకు పాల్పడ్డారని అన్నారు. సంఘం డైరీ హక్కులను న్యాయ పోరాటం ద్వారా సాధించుకుంటాం, మిమ్మల్ని చూసి భయపడి పారిపోతామనుకోవడం నీ పొరపాటు అన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజామాష్టారు, కంచర్ల శివరామయ్య, వలివేటి ధర్మారావు, శ్రీనివాసరావు, నాయుడు ఓంకార్, బొబ్బిలి రామారావు పాల్గొన్నారు.

మైనార్టీలకు ప్రాధాన్యం : అప్పిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



దేశంలో ఎక్కడా లేని విధంగా మైనారిటీల భద్రత, సంక్షేమం, ఉన్నతికి వైసిపి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా పట్టాభిపురంలోని షాదీఖానాలో ముస్లిం మైనారిటీల కుటుంబాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు ఉపకార అందించే కార్యక్రమం జరిగింది. శుక్రవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ ఘర్, షాదీఖానా కమిటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే మద్దాళి గిరి తదితరులతో కలి విద్యార్థులకు ఉపకార వేతనాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్న కారణంగానే తమ పార్టీ ముస్లిం సమాజంలో బలంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ, అందరూ విద్యావంతులైతే సమాజం బాగుంటుందని రాష్ట్రం బాగుపడుతుంది అన్న భావనతో సిఎం జగన్ విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ రోషన్, కార్పొరేటర్లు షేక్ రోషన్, మార్కెట్ బాబు, అచ్చాల వెంకటరెడ్డి, గురవయ్య, బూసి రాజలత, ప్రభుత్వ ఖాజీ ఉస్మాన్, ముఫ్తీ బషీర్, మన్సూర్, హఫీజ్ ఇర్షాద్, ఇసాక్, షాదీఖానా కమిటీ ఫరియాజ్, షఫి, నజీర్, బాబు, గౌస్, నజీర్, అబ్బాస్, షౌకత్ ఆలీ, అబ్దుల్ రెహ్మాన్, నూనె ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణాల్లో నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాల్లో నిబంధనలు పాటించాలని, లేనిచో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీచేయబోమని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ ఎస్‌విఎన్ కాలని, నవభారత్ నగర్, అశోక్ నగర్ ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, తదుపరి అనుమతులపై పట్టణ ప్రణాళిక అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ర్యాంప్‌లు రోడ్డు మీదకు రాకుండా చూడాలని, సెట్‌బ్యాక్‌లో ఎటువంటి నిర్మాణాలు చేయకూడదని అన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎల్.టి.పి.లు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డి.పి.ఎం.ఎస్.లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువపత్రాలు, నిబందనలకు అనుగుణంగా దరఖాస్తు చేయాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయడం జరుగుతుందన్నారు. మాస్టర్ ప్లాన్ ఎలైన్మెంట్ గానీ, లేదా మాస్టర్ ప్లాన్‌లో చేసిన భవన నిర్మాణాలకు ఆక్యుపెన్సీ అనుమతులు ఇవ్వబడవన్నారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడెనింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా ఆక్యుపెన్సీ ఇవ్వడం జరగదన్నారు.పర్యటనలో డిప్యూటీ సిటీ ప్లానర్ మహాపాత్రో, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మురళి, టిపిఎస్ హదయరాజు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ఎం వర్సిటీకి రూ.1.40 కోట్ల డీఎస్టీ గ్రాంట్

మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్లకు వీసీ అభినందనలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయానికి కేంద్రం ప్రభుత్వం పరిధిలోని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ విభాగం నుంచి రూ.1.40 కోట్ల పరిశోధనా గ్రాంటు మంజూరైంది. యూనివర్సిటీ రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ గ్రాంటును వినియోగించాల్సి ఉంది. యూనివర్సిటీకి చెందిన మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్లు ప్రతిపాదించిన పరిశోధనా ప్రాజెక్టులను పరిశీలించిన పిదప డీఎస్టీ ఈ గ్రాంటును మంజూరు చేసింది. కేవలం ఐదేళ్ల కిందట ప్రారంభమైన ఏపీ ఎస్ఆర్ ఎం యూనివర్సిటీ పరిశోధనల్లో సాధించిన పురోగతికి ఇది నిదర్శన మని వైస్ ఛాన్సలర్ మనోజ్ కుమార్ ఆరోరా అభిప్రాయపడ్డారు. పరిశోధనా సామర్థ్యాలను పెంచుకోవడానికీ, కొత్త ఆవిష్కరణకు ఈ గ్రాంటు ఎంతగానో దోహదపడుతుందని వీసీ మనోజ్ అన్నారు. ఈ సందర్భంగా మెకానికల్ విభాగం ప్రొఫెసర్లను విసి అభినందించారు.



కళాశాల అధ్యాపకులతో మాక్ పీర్ కమిటీ సభ్యులు

సెయింట్ ఆన్స్ కళాశాలను సందర్శించిన మాక్ పీర్ కమిటీ

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలకు నాక్ గుర్తింపునకు సంబంధించి శుక్రవారం మాక్ పీర్ కమిటీ సభ్యులు రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఆచార్య సిరిపురపు శంకర్, జెకెసి కాలేజి పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్.ఆర్.కె.ప్రసాద్, జెకెసి కాలేజి వైస్ ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ సందర్శించారు. కమిటీ సభ్యులు కళాశాలలోని ప్రతి విభాగాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ఫాతిమారాణి.పి పాల్గొన్నారు.



అవినీతి నిర్మూలనలో యువత పాత్ర కీలకం

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - తెనాలి

సమాజంలో అవినీతి నిర్మూలనలో యవత పాత్ర కీలకమైందని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని పెదకాకాని మండలం నంబూరులో వివిఐటి ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 'అవినీతికి నో చెప్పండి దేశానికి కట్టుబడి ఉండండి' అన్న నినాదంతో అవినీతిని అరికట్టడం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అడిషనల్ చీఫ్ సెంట్రల్ విజిలెన్స్ ఆఫీసర్ బాల్ ముకుంద్ శర్మ, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ టి కామేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతి నిర్మూలనలో యువత పాత్ర కీలకమని, నైతిక బాధ్యత, వ్యక్తిగత క్రమశిక్షణ అవినీతికి అంతం పలుకుతుందన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ నంబూరు పరిధిలో వివిఐటి కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏటీఎంను ఆ బ్యాంక్ చైర్మన్ కామేశ్వరరావు ప్రారంభించారు. ర్యక్రమంలో వివిఐటి చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ పి మారుతి రావు, గుంటూరు రీజినల్ మేనేజర్ పి వీరారెడ్డి, నంబూరు బ్రాంచ్ మేనేజర్ బి కోటిరెడ్డి, విజిలెన్స్ ఆఫీసర్స్ రాంబాబు, విజయ్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఊడిజర్ల,ఈపూరు, ముప్పాళ్ళ,కొచ్చర్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి,33 కెవి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు మరమ్మత్తుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాను ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపి వేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి గాంధీ బాబు తెలిపారు.విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



ధన్వంతరి వేడుకలు

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక ఎన్ఎస్పి కాలనీలోని పట్టణ, గ్రామీణ పిఎంపి, ఆర్ఎంపి వైద్యుల ఐక్యవేదిక యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ పాశం నాగమల్లేశ్వర రావు ఆధ్వర్యంలో వైద్య పితామహుడు శ్రీ ధన్వంతరి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడారు. కార్య క్రమంలో కె. బ్రహ్మ నందం,పి. వెంకటేశ్వర రెడ్డి, ఎం బ్రహ్మయ్య , పి శ్రీనివాసరెడ్డి, పి. రామలింగాచారి ,యస్. కె. హుసేన్, ఎం సాంబశివరావు, ఎన్.వెంక టేశ్వర్లు, నాసరయ్య, వి.శ్రీనివాసరావు, యు.పేరయ్య పాల్గొన్నారు.



అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవల ప్రతి ఒక్క విద్యార్థి గుర్తుంచుకోవాలని, విద్యార్థి దశ నుంచే ఆయన ఆదర్శాలను అలవర్చుకోవాలని హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు అన్నారు. మండల పరిధిలోని పోతవరం గ్రామంలో కస్తూరి గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం హెల్ప్ ఫౌండేషన్ సత్తెనపల్లి ఆధ్వర్యంలో అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పీపుల్స్ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భగా డెంటిస్ట్ డాక్టర్ శ్రీ లక్ష్మీ పలు జాగ్రత్తలు చెప్పారు. విద్యలో ఆసక్తి కనపరుస్తున్న విద్యార్థులకు మ్యాచ్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి పాల్గొన్నారు.

తుమ్మపూడిలో 'పల్లెకుపోదాం'

ప్రజాశక్తి-దుగ్గిరాల

సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం జగన్‌దేనని వైసిపి ప్రజా ప్రతినిధులు అన్నారు. మండలంలోని తుమ్మపూడి గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియపరచాలన్నారు. ఇన్చార్జి ఎంపీడీవో డి వీరయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. వివిధ సంక్షేమ పథకాల క్రింద తుమ్మపూడి గ్రామానికి ఇంతవరకు 18 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు వారు తెలిపారు.

హర్ ఘర్ జల్ గ్రామంగా దింతెనపాడు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలం లోని దింతెనపాడు గ్రామము ను హర్ ఘర్ జల్ గ్రామం(ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చిన గ్రామం) గా ప్రకటించారు. జల్ జీవన్ మిషన్ సమన్వయ కర్త తేజ్ సంగీత్ శుక్రవారం గ్రామానికి వచ్చారు. పంచాయతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో సర్పంచ్ దేవరపు సుమతి కి హర్ ఘర్ జల్ డిక్లరేషన్ పత్రాన్ని అందజేశారు. గ్రామంలోని ప్రతి వ్యక్తికీ తాగునీటిని అందించాలని సూచించారు. ప్రతి పదిహేను రోజులకొకసారి నీటిని క్లోరినేషన్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూ ఎస్ ఏ.ఈ శ్రీనివాసరావు, ఎం ఆర్వో కుటుంబరావు, పిఓపిఆర్డి వరూధిని, పిఎస్ శశికళ, లావణ్య, ఐఎస్ఎ (పోర్డ్) ప్రతినిధులు గేరా రాజ్ కుమార్, నళిని పాల్గొన్నారు.



సర్పంచ్ దేవరపు సుమతి కి హర్ ఘర్ జల్ డిక్లరేషన్ పత్రాన్ని అందజేస్తున్న సమన్వయ కర్త తేజ్ సంగీత్

భారంగా మారిన పేదల బతుకులు : టిడిపి

ప్రజాశక్తి - వినుకొండ



రాష్ట్రంలో జరుగుతున్న జగన్ రెడ్డి దోపిడి పాలనతో పేదల బతుకులు భారంగా మారాయని పలనాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేను బాగుంటే చాలు, నా పార్టీ ఎమ్మెల్యేలు దోచుకుంటే చాలని జగన్ రెడ్డి నాలుగు నరేళ్లగా అవినీతి అక్రమాలు చేస్తూ ప్రజలకు ఒక్క మంచి పని కూడా చేయలేదని ఆయన పెద్దేవా చేశారు. జాబ్ క్యాలెండర్ ఇస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జగన్ రెడ్డి రాష్ట్రంలో యువత జీవితాన్ని నాశనం చేశారని విమర్శించారు. టిడిపి పాలనలో సమాజం బాగుండాలని చంద్రబాబు నాయుడు ఆలోచించి యువతకు పెద్దపీట వేస్తూ 6.50 లక్షల ఉద్యోగాలు కల్పించి ఆదుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనను చూసి ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయాయని అన్నారు. యువత జీవితమంటే చాపలకోట్లు మటన్ కొట్లు యువతకు భవిష్యత్తుని ఇస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రానికి భవిష్యత్తునివ్వటం చేతగాని అసమర్థ సీఎం జగన్ రెడ్డి గజ దోపిడీ చేస్తున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రూ.1 టిట్కో ఇల్లు ఇస్తానని ప్రకటించి ఇప్పుడు 5.50 లక్షలు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే అనే పార్టీ కార్యక్రమం చేస్తూ ఉద్యోగులను భాగస్వామ్యం చేయడం చట్టం అన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని ఎన్నికల ముందు వాగ్దానం చేసిన సీఎం జగన్ రెడ్డి అధికారంలోకి రాగానే సిపిఎస్ రద్దు చేయకపోగా మద్యం షాపుల వద్ద టీచర్లతో డ్యూటీ చేయించిన దుర్మార్గపు పాలన అని విమర్శించారు. మద్యపాన నిషేధం చేస్తానని ఊరికి 20 బెల్ట్ షాపులు పెట్టించి అధిక మద్యం వ్యాపారంతో జగన్ రెడ్డి అక్రమంగా వేలకోట్లు దోచుకుంటున్నారని విమర్శించారు.సిపిఎస్ రద్దు చేస్తానని మోసం చేయటం, ఎన్నికల హామీలు నిలబెట్టుకోకపోగా అనేక అక్రమాలకు పాల్పడ్డ వైసిపి ప్రభుత్వానికి ప్రజలు చెప్పులతో స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. నూతన ఇసుక పాలసీ పేరుతో రాష్ట్రంలోని 30 లక్షల భవన నిర్మాణ కార్మిక కుటుంబాలను చిత్రహింసలకు గురిచేసి క్రమంగా ఇసుకను అమ్ముకొని వేలకోట్లు గడించారని ఆరోపించారు. 175 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం పై ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నోటీసులు రాలేదని మాట్లాడటం దిగజారుడుతనమని ఎద్దేవా చేశారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షులు ఆయుబ్ ఖాన్, పివి సురేష్ బాబు, షమీం ఖాన్, పెమసాని నాగేశ్వరరావు, హనుమా నాయక్, గోవిందరాజులు తదితరులు ఉన్నారు.

గంగిరెడ్డికి బెయిల్ మంజూరు

పరామర్శించిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా




ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడని నరసరావుపేట నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రెడ్డిని మద్యం కేసులో అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు అన్నారు. రిమాండ్ లో ఉన్న గంగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డికి శుక్రవారం బెయిల్ మంజూరు కావడంతో జైలు నుంచి బయటకు వచ్చిన గంగిరెడ్డిని డాక్టర్ కడియాలతో పాటు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ అధికారి గోనుగుంట్ల కోటేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మెట్టి వెంకటేశ్వర్ రెడ్డి టిడిపి నేతలు కొలికొండ కొండలు నాగిరెడ్డి నవీన్ శ్రీను తదితరులు జైలు వద్ద పరామర్శించారు.

శ్రీనివాస్ రెడ్డికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో పాటు ,పలువురు టీడీపీ నేతలు ఫోన్ చేసి పరామర్శించారు. టిడిపి అండగా ఉంటుందని భరోసా గంగిరెడ్డి శ్రీనివాస రెడ్డికి భరోసా ఇచ్చారు.

బదిలీ అయిన వైద్యాధికారిణికి సన్మానం

ప్రజాశక్తి-రొంపిచర్ల



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్యాధి కారిణిగా పనిచేస్తూ బదిలీ అయిన డాక్టర్ స్వాతి కి శుక్రవారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి మాట్లాడుతూ వైద్యాధికారిణి స్వాతి హాస్పిటల్ కు వచ్చిన రోగులకు విశేషమైన సేవలు అందించారని అన్నారు. కరోనా సమయంలో ఆమె చేసిన వైద్య సేవలు మరువలేనివని అన్నారు. వైద్యాధికారిణి స్వాతి మాట్లాడుతూ గ్రామస్థులు, వైద్య సిబ్బంది సహకారంతో వైద్యసేవలందించానని అన్నారు. అనంతరం ఆమెను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, సిహెచ్ ఓ చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 27.50 లక్షలతో సిసి రోడ్ల ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలోనే వివిధ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి 27.50 లక్షలు కేటాయించినట్లు పంచాయతీరాజ్ డి ఈ పాశం శ్రీనివాస్ రెడ్డి సర్పంచి వెంకటేశ్వర్ రెడ్డిలు తెలిపారు శుక్రవారం రోడ్లు ఏర్పాటుకు భూమి పూజ చేశారన్నారు ఈ నిధులను ఎన్ఆర్ఈజీ ద్వారా కేటాయించారు అన్నారు ఈ కార్యక్రమంలో గొట్టం భాస్కర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏయి నరేంద్ర రెడ్డి, బంగారు రెడ్డి,ఓర్సు కాశయ్య పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లు గృహాలు బయట బిగించాలి

ప్రజాశక్తి-రెంటచింతల

విద్యుత్తు మీటర్లను గృహాలు బయట ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ ఏఈ మస్తాన్వలి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు గహాల్లో మీటర్లు ఉండడం వలన రీడింగు నమోదు కష్టమవుతుందని వినియోగదారులు తమ ఇళ్ల బయట వీటిని బిగించుకోవడానికి అనువుగా ఉండే ప్రదేశంలో మీటర్లు బిగించాలని సూచించారు

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-ఈపూరు

56వ గ్రంథాలయ వారోత్సవాలను మండల కేంద్రం ఈపూరు శాఖ గ్రంథాలయంలో ఈనెల 14న ప్రారంభిస్తున్నట్లు గ్రంథాలయ నిర్వహకులు గంటా శ్రీనివాసరావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 వ తేదీ నుండి 20 వ తేదీ వరకు వారోత్సవాలు జరుపుతామన్నారు. పుస్తక ప్రదర్శన,మాదక ద్రవ్యాల పై అవగాహన, పుస్తక పఠనప్రాముఖ్యత, గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను స్మరించుట,చిత్రలేఖనం, వ్యాసరచన,వకత్వ,క్విజ్,క్రీడల పోటీలు,దిశా చట్టం పై అవగాహన లాంటి అంశాలపై విద్యార్థులకు వివరించటంతో పాటు, పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని తెలిపారు.



స్వచ్ఛభారత్ షెడ్డును పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి మండల పరిధిలోని ధరణికోట గ్రామంలోని చెత్త నుండి సంపద కేంద్రం షెడ్ స్థలాన్ని యంపిడిఓ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ ఆదాయం పెంచుకునేందుకు డంపింగ్ యార్డులు ఎంతో అవసరమని ఆమె అన్నారు. పారిశుద్ధ కార్మికులు గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించే విధంగా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి, ఏపిఓ, పంచాయతీ కార్యదర్శి కిషోర్ , ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పంచాయతికార్యదర్శి పై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం పాతమాగులూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం పూర్ణచంద్రరావు పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలనిక ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు బెజ్జం సంపత్ బాబు ,గౌరవ అధ్యక్షులు పమ్మి వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకులు భూపతి విజయానంద్ లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులను కించపరుస్తూ వారి మనోభావాలను దెబ్బతీసేలా అధికారులను ఆపాదించుకొని స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని సమావేశానికి గైర్హాజరు పేరుతో మెమొలు జారీ చేయడం నిబంధనలకు విరుద్ధమని, ఉపాధ్యాయులను అగౌరవపరచడమేనని విమర్శించారు.





మంగళగిరి సిపిఎం కార్యాలయంలో మాట్లాడుతున్న పిన్నమనేని మురళీకృష్ణ, ప్రజారక్షణ భేరిపై కుంచనపల్లిలో, పేరేచర్లలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ప్రజలపై భారాలు వేస్తున్న బిజెపి ప్రభుత్వం

ప్రజాశక్తి-మంగళగిరి

సిపిఎం ప్రజారక్షణ భేరీ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీన విజయ వాడ లో జరిగే బహిరంగ సభకు మంగళగిరి ప్రాంతం నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ నాయ కులు పిన్నమనేని మురళీకష్ణ పిలుపు నిచ్చారు. శుక్రవారం రాత్రి మంగళగిరి సిపిఎం కార్యాలయంలో జరిగిన సమా వేశంలో పాల్గొని ప్రసంగించారు. దేశానికి, రాష్ట్రానికి నష్టం కలిగించే ఆర్థిక విధా నాలను అవలంబిస్తున్న బిజెపిని ఒంటరి చేసి రానున్న ఎన్నికల్లో ఓడించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభు త్వం రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడకపోగా, వైసిపి ప్రభుత్వం అండతో అనేక రూపాలలో ప్రజ లపై భారాలు వేసిందని విమర్శించారు. అందులో భాగంగానే కరెంటు చార్జీలు పెరుగుదల, చెత్త పన్ను వేయడం, ఇంటి పన్ను పెంచడం వంటి చర్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకున్నా రని విమర్శించారు. ఇలాంటి పరిస్థితులు సిపిఎం ప్రత్యామ్నాయ విధా నాలను ప్రజలకు తెలియజేసేందుకు జరుగు తున్న సభకు ప్రజలు తరలిరావాలని అన్నారు. సమావేశంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వివి జవహర్‌లాల్, ఎం.బాలాజి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న మతోన్మాద బిజెపిని వ్యతిరేకించా లని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లిలో సిపిఎం నాయకులతో కలిసి ఆయన కర పత్రాలు పంపిణీ చేస్తూ, విస్తృత ప్రచారం నిర్వహించారు. సిపిఎం కుంచనపల్లి శాఖ కార్యదర్శులు ఎ.రంగా రావు, కె.వెంకటేశ్వర రావు, సిపిఎం నాయ కులు ఎ.రామారావు, ఎన్.బాబురావు, ఎ. సుబ్బారావు, ఎ. కైదుల రావు పాల్గొన్నారు. వడ్డేశ్వరంలో ప్రజా రక్షణభేరి ప్రచార కార్యక్రమాన్ని నిర్వ హిం చారు. ప్రధాన రహదారులలో కర పత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివ శంకరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలకు వ్యతిరేకంగా అసమానతలు లేని అభివృద్ధి జరగాలని అన్నారు. ప్రచార కార్య క్రమం లో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు వడ్డేశ్వరం బిక్షాలు, వడ్డేశ్వరం



వడ్డేశ్వరంలో

కోటేశ్వరరావు, సిపిఎం గ్రామ శాఖ కార్య దర్శి వడ్డేశ్వరం పున్నయ్య, గుడిసె ప్రభు దాస్, లటికె కోటేశ్వరరావు, రాజు పాల్గొన్నారు

ప్రజాశక్తి- మేడికొండూరు

మేడికొండూరు, పేరేచర్ల గ్రామాల్లో ప్రజా రక్షణ బేరి సభ పై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా సిపిఎం కార్యవర్గ సభ్యులు బైరవగానే శ్రీనివాసరావు,మండల కార్యదర్శి బొట్ల రామకృష్ణ పాల్గొన్నారు.




రెండు సబ్ సెంటర్లకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

ప్రజాశక్తి-దుగ్గిరాల

మండల కేంద్రం దుగ్గిరాల పిహెచ్‌సి సెంటర్ పరిధిలోని రెండు సబ్ సెంటర్లు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సబ్ సెంటర్లుగా గుర్తింపు పొందాయి. దుగ్గిరాలలోని తూర్పు సబ్ సెంటర్ 93 శాత, మోరంపూడి సబ్ సెంటర్ 91 శాతం ప్రమాణాలు పాటి స్తున్నట్లు కేంద్ర కమిటీలు నిర్ణయించాయి. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు) పాటించి ఈ ఘనతను సాధించినట్లు పిహెచ్‌సి డాక్టర్ అబ్దుల్ రహమాన్ తెలిపారు. ఒక పిహెచ్సి పరిధిలో రెండు సబ్ సెంట ర్లు ఈ ఘనత సాధించలేదని చెప్పారు. సెప్టెంబర్ 27వ తేదీన కేంద్ర బృందం ఈ సెంటర్లను పరిశీలించి ప్రమాణాలు పరి శీలించిందని, శుక్రవారం ఈ మేరకు కేంద్ర బృందం పంపించిన సమాచారాన్ని జిల్లా కేంద్రం పిహెచ్‌సికు తెలియజేసింది. మొత్తం ఏడు ప్రమాణాలు పాటించినందుకు ఆయా సబ్ సెంటర్లకు ఈ ఘనత లభించింది. గర్భిణులకు, చిన్నపిల్లల పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలు, పురిటిబిడ్డలు, పసిపిల్లల పోషణ, పిల్లలు,యువకుల ఆరోగ్య సేవలు, ఫ్యామిలీ ప్లానింగ్, సంక్ర ˆమించే వ్యాధులు, సంక్రమించని వ్యాధులు, సాధారణ అనా రోగ్యం తదితర అంశాలను పరిశీలించి ప్రమాణాలు నిర్ణ యిస్తారు. ఉత్తమ సేవలు అందించిన వారిలో డాక్టర్ రెహమాన్ తో పాటు డాక్టర్ సి.ఇందిర, సిబ్బంది బుజ్జి,లీల,ఆశ వర్కర్లు ఉన్నారు .

చేబ్రోలు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - చేబ్రోలు



మండల సర్వసభ్య సమావేశం మండల పరి షత్ అధ్యక్షులు కొక్కిలిగడ్డ సాహితీ కిరణ్ అధ్యక్షతన శుక్ర వారం నిర్వ హించారు. మం డలంలో నిర్వహించిన వివిధ సంక్షేమ, అభి వృద్ధిపై అధికారు లతో సమీక్షించారు . సంక్షేమం, అభివృద్ధి, సేవ లను ప్రజలు సమర్థ వంతంగా ఉపయోగించుకునే విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధులు కీలకమని అన్నారు.ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళను సకాలంలో ఆసు పత్రికి తరలిం చడంలో చొరవ చూపిన సచివాలయం చేబ్రోలు - 2 మహిళా పోలీస్ సౌజన్య, సచి వాలయం చేబ్రోలు -1 గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రవీణ్ కుమార్, రిపోర్టర్ సురేష్‌ను అధికారులు, ప్రజాప్రతి నిధులు అభినందించి సత్క రించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, కె.అనిత పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ నేత డేవిడ్ మృతి

సిఐటియు రాజధాని కమిటీ సంతాపం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ విజయవాడ నగర కార్యదర్శి మన్నెం డేవిడ్ అనారోగ్యంతో గురువారం సాయంత్రం విజయవాడలో మృతి చెందడంపై సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి సం తాపం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎర్రబాలెం మున్సి పల్ కార్మికులు మాస్టర్ పాయింట్ వద్ద సంతాపం తెలిపారు. రవి మాట్లాడుతూ విజయ వాడ నగరంలోని మున్సిపల్ కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించి, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేసిన నిబద్ధతగల, కార్మికపక్షపాతి డేవిడ్ అని, ఆయన మృతి కార్మికులందరికీ తీరని లోటని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపు తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాజధాని ప్రాంత మున్సిపల్ యూనియన్ నాయకులు బాబు,రామారావు ,ఆదిలక్ష్మి మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. శుక్రవారం నాడు విజయవాడ అజిత్ సింగ్ నగర్ లో జరిగిన డేవిడ్ అంత్యక్రియలలో రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘంనుండి రవి, కుచేలరావు పాల్గొని నివాళు లర్పించారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు

నారాకోడూరు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - చేబ్రోలు



రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు నారాకోడూరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం ఏడు కొండలు తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుండి 12 వరకు విజయవాడలోని పడమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్ బాల్ పోటీలలో 14 సంవత్సరాల లోపు బాల బాలికల హ్యాండ్ బాల్ టోర్నమెంట్ పోటీలలో పాల్గొన నున్నట్లు తెలిపారు.గుంటూరు జిల్లా జట్టు తరపున నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా ర్థులు 8 మంది బాలురు, ఇద్దరు బాలికలు పోటీలలో పాల్గొనేందుకు ఎంపిక కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

వస్తువులు, కుట్టు మిషన్లు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని ప్రాతూరులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వివిధ రకాలైన వృత్తిదారులకు 20 మంది మహిళలకు కుట్టుమిషన్లు, నాలుగు తైవాన్ పం పులు, రెండు రిక్షాబండ్లు, సెలూన్ చైర్లను తెలుగుదేశం నాయకులు అందజేశారు. శుక్రవారం రాత్రి గ్రామంలోని టిడిపి కార్యాలయం వద్ద వీటిని అందజేశారు. ఇటీవల గ్రామంలో రోడ్డు వెడల్పు లో భాగంగా ఇల్లు కోల్పోయిన బాధితులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున నలుగురికి టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, టిడిపి తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, టిడిపి ప్రాతూరు గ్రామ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాసరావు అందజేశారు. అరవపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో తాను వివిధ రకాల వృత్తిదారులకు



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

మహిళలకు జీవనోపాధి నిమిత్తం అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి టి.జానకిదేవి, మంగళగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఎ.భూలక్ష్మి, తాడేపల్లి మండల మహిళా అధ్యక్షురాలు బి.కృష్ణ వందన, ప్రాతూరు గ్రామ మహిళా అధ్యక్షురాలు డి. జయలక్ష్మి,తాడేపల్లి మండల ఎస్సీ సెల్ కార్య నిర్వాహన కార్యదర్శి పి.దిబ్బయ్య, మంగళగిరి నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ కార్యదర్శి చొక్కా ఫ్రాన్సిస్, పాల్గొన్నారు..



అర్జీలు స్వీకరిస్తున్న జెసి రాజకుమారి

తాడికొండలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - తాడికొండ

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరిగింది. తమ సమ స్యలను పరిష్కరించాలని కోరుతూ అనేకమంది అర్జీలను అందజేశారు. తాడికొండ అడ్డరోడ్డు లోని ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పున్నమ్మ చెరువును కాపాడాలని సిపిఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకరరావు, రామినేని నరసింహారావు, జెసి రాజకుమారికి వినతిపత్రం అందజేశారు విద్యుత్తు రెవెన్యూకు సంబంధించి అర్జీలు వచ్చాయి ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరిం చేందుకు ఈ వేదిక ఎంతగానో ఉపయోగపడుతుంద న్నారు. ఆయా సమస్యలకు పదిహేను రోజుల్లో పరి ష్కారం దొరుకుతుందన్నారు. అప్పటికీ సమస్య పరి ష్కారం కాకుంటే నేరుగా తమను సంప్రదించాలని అర్జి దారులకు సూచించారు. కార్యక్రమంలో వైసిపి నియోజక ˆవర్గ సమన్వయ కర్త కత్తెర సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో పంట నమోదు ధ్రువీకరణ పత్రాలు

ప్రజాశక్తి-తాడేపల్లిరూరల్

గ్రామంలోని ప్రతి రైతు పంట నమోదు ధ్రువీకరణ పత్రాలను, పంట నమోదు చేయించుకున్న రైతు భరోసా కేంద్రంలో పొందాలని సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంటిఎంసి పరిధిలోని ఇప్పటంలోని రైతు భరోసా కేంద్రంలో తాడేపల్లి మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంగళగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు. ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు కోసం ప్రతి ఆర్‌బికెలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు హైమావతి, మండల వ్యవసాయ అధికారి ఆత్మకూరి శ్రీనివాసులు, గ్రామ వ్యవసాయ సహాయకులు యశ్వంత్ సాయి, ప్రసాద్ పాల్గొన్నారు.



'పార్టీ నిర్ణయానికి కట్టుబడి పని చేస్తా'

ప్రజాశక్తి-మంగళగిరి

రానున్న ఎన్నికల్లో జనసేన రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు కట్టుబడి పని చేస్తామని జనసేన రాష్ట్ర నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మంగళగిరి పట్టణ జనసేన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమా వేశం మాట్లాడారు. త్వరలో మంగళగిరి అసెంబ్లీ నియోజక వర్గం టిడిపి, జనసేన ఉమ్మడి సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. చీరాలలో తాను పోటీ చేస్తున్నట్లుగా వస్తున్న వార్తలను ఆయన ఖండిం చారు. సమావేశంలో జనసేన రాష్ట్ర నాయకులు బి.విజయ శేఖర్, ఎంపిఎంసి జనసేన పార్టీ అధ్యక్షులు ఎం. వెంకట మారుతీరావు, ఎంపిఎంసి మైనార్టీ భాగం అధ్యక్షులు షేక్ సుభాని, పి.కోమలి పాల్గొన్నారు.

దూరవిద్య కేంద్రం పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూర విద్యా కేంద్రం ఆగస్టులో నిర్వహించిన మొదటి, రెండవ, మూడవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను శుక్రవారం విసి ప్రొఫెసర్ పి. రాజశేఖర్ విడుదల చేశారు. ఎం. కామ్, ఎమ్ హెచ్ ఆర్ ఎం, ఎం ఎల్ ఐ ఎస్ సి, సోషల్ వర్క్, బిఎల్ ఐసి, ఇంగ్లీష్, ఎకనామిక్స్, హిందీ, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సంస్కృతం, సోషియాలజీ తెలుగు, జర్నలిజం కోర్సుల ఫలితాలు ఉన్నాయి. ఫలితాలకు సంబంధించి రీవాల్యుయేషన్కు దరఖాస్తు చేసుకునే వారు ఈనెల 20వ తేదీలోగా ఒక్కో పేపర్ కు రూ.960 రూపాయలు, (బి ఎల్ ఐ ఎస్ సి రూ.770) చెల్లించి 25 తేదీ కల్లా యూనివర్సిటీ పరీక్షల విభాగం కోఆర్డినేటర్ కార్యాలయానికి దరఖాస్తులు అందేలా పంపాలన్నారు. ఫలితాలను దూరవిద్యా కేంద్రం వెబ్‌సైట్‌లో పొందు పరిచినట్లు దూరవిద్య పరీక్షలు కోఆర్డినేటర్ డాక్టర్ కే. సోమశేఖర్ తెలిపారు. ఈ సందర్భంలో రెక్టర్ ప్రొఫెసర్ పి. వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. కరుణ, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగరాజు, దూరవిద్యా కేంద్రం పరీక్షలు డిప్యూటీ రిజిస్టర్ సయ్యద్ జైనుల్లుద్దీన్, సిటిఏ డాక్టర్ కృష్ణసత్య తదితరులు పాల్గొన్నారు.

ఆటలే ఆరోగ్యం, ఆనందం : ఎన్.మంగాదేవి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న డాక్టర్ మంగాదేవి

చౌడవరంలోని వేంకటేశ్వర బాలకుటీర్ చేతన లో వార్షిక క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ యన్.మంగాదేవి మాటాడుతూ ఆటలే ఆరోగ్యానికి మొదటి మెట్టని అన్నారు. విద్యార్థులలో క్రమశిక్షణకు, చురుకుదనాన్ని పెంచి మనోధైర్యం కలిగించటానికి ఆటలు దోహదం చేస్తాయని ఆమె అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ యమ్.విజయలక్ష్మి తమ చిన్నతనంలో ఆటలకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చేవారు కాదని, కానీ బాలకుటీర్ క్రీడలకు పెద్దపీట వేసి చక్కని ప్రోత్సాహాన్ని అందిస్తున్నదని, దానిని ఉపయోగించుకొని ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని ఆకాంక్షించారు.డాక్టర్ హేమ సుందర్ ప్రస్తుత కాలంలో పిల్లలు ఎలక్ట్రానిక్ సాధనాల వ్యామోహంలో పడి క్రీడల పై దృష్టి సారించలేక పోతున్నారని దైనందిన జీవితంలో క్రీడలను భాగంగా చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.బాలకుటీర్ సీ.ఏ.ఓ దుర్గా రఘురామ్ క్రీడలలో ఇంకా మెరుగైన సత్తాను చాటాలని దానికి కావలసిన ప్రోత్సాహాన్ని అందిస్తామని విద్యార్థులకు తెలిపారు. అనంతరం వివిధ పోటీలలోని విజేతలైన విద్యార్థులకు బహుమతులను కావ్య, తిలక్ నందా అందించారు.కార్యక్రమములో సహకార్యదర్శి జయశ్రీ , కోఆర్డినేటర్ మరుధ్వతి, ప్రధానోపాధ్యాయులు నస్రిన్, వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున రావు, లక్ష్మిప్రసన్న పాల్గొన్నారు.

వైద్యులు సానుకూల దృక్పథాన్ని పెంపొందించాలి

ప్రజాశక్తి-గుంటూరు




మాట్లాడుతున్న భాష్యం రామకృష్ణ

వైద్యులు తమ వద్దకు వచ్చే రోగుల్లో సానుకూలమైన దృక్పథాన్ని పెంపొందించాలని, తద్వారా వారు ఎంతో ఆరోగ్యవంతులుగా తయారవుతారని, దీనిని ప్రతి ఒక్క వైద్య విద్యార్థి గుర్తెరిగి నడుచుకుంటే భవిష్యత్‌లో ఉత్తమ వైద్యులుగా రాణిస్తారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని చంద్రమౌళినగర్ లోని భాష్యం మెడెక్స్, గోరంట్లలోని ధన్వంతరి, రామసేతు మెడి ఎయిమ్స్, ధన్వంతరి గరల్స్ హాస్టల్, సుశ్రుత బాలుర హాస్టల్ క్యాంపస్‌లలో రామకృష్ణ ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రామకృష్ణ విద్యార్థుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ నేటి ప్రపంచంలో వైద్య వృత్తి అనగానే ధనార్జనే ప్రధాన ధ్యేయం అనే అపోహ ఉందని, అలా కాకుండా రోగుల మనసెరిగి నడుకుంటూ వారిలో భరోసా నింపాలన్నారు. మెడికల్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ ద్వారా భాష్యం విద్యాసంస్థలు విద్యార్థులను ఉత్తమ వైద్యవిద్యను అందించేందుకు కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉత్తమ వైద్యులుగా స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు, మెడిఎయిమ్స్ ప్రిన్సిపాల్ సుధ, చాంద్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

సుమేధాలో నేవీ అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధా హైస్కూల్లో శుక్రవారం ఇండియన్ నేవీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశాఖ పట్టణం నుండి నేవీ లెఫ్టినెంట్ శవన్ కుమార్‌చౌదరి, వాసు, ఆనంద్ తదితరులు హాజరయ్యారు.వారు నేవీ ఫోర్స్ గురించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేవీలో చేరటానికి కావాల్సిన విద్యార్హతల గురించి సూచనలు ఇచ్చారు. విద్యార్థులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నేవీ సిబ్బందితో విద్యార్థులు

యువతకు సామాజిక బాధ్యత ఉండాలి

ఎపి సిఐడి ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌పి కెజివి సరిత

ప్రజాశక్తి - ఎఎన్‌యు

విద్యార్థులు విలాసాలకు అలవాటు పడి జీవితాలను వెనక్కు నెట్టుకుంటున్నారని, దీనివల్ల నష్టం జరుగుతుందని, యువత సామాజిక బాధ్యతతో మెలగాలని ఎపి సిఐడి ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌పి కెజివి సరిత తెలిపారు. శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో డైక్ మెన్ ఆడిటోరియంలో ప్రొఫెషనల్ కళాశాలల విద్యార్థులకు ఇండక్షన్, యాంటి ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి. సిద్దయ్య అధ్యక్షత నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్‌పి సరిత ప్రసంగించారు. తన 14 సంవత్సరాల సర్వీసులో ఎన్నో నేరాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఒక వ్యక్తి సంపూర్ణ వికాసానికి ఆర్థిక, సామాజిక, వృత్తిపరమైన, ఆలోచన పరమైన అంశాలు చోటు చేసుకుంటాయన్నారు. అయితే నేడు యువత తన ఇష్టానుసారం జీవిస్తూ జీవితానికి అర్థం లేకుండా చేసుకునే సంఘటనలు కూడా తమ ముందుకు వచ్చాయని వివరించారు. తమకు జీవితాన్ని ఇచ్చిన తల్లిదండ్రులకు, రాష్ట్రానికి, దేశానికి ఏ విధమైన సహాయం చేస్తున్నామో గుర్తు చేసుకోవాలని వివరించారు. చదువుకున్న డిగ్రీలు, ఉద్యోగాలలో వస్తున్న వేతనాలు ఎన్ని ఉన్నా మన వల్ల ఇతరులు ఇబ్బంది పడకూడదనే సామాజిక స్పృహ ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 14, ఆర్టికల్ 21 వీటిలో ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు పొందుపరిచారని ఒకటి తనకు నచ్చినట్లు ఉండొచ్చని చెప్తూనే మరొకటి ఇతరుల స్వేచ్ఛకు భంగం కలుగకూడదని చుసిస్తుందని వివరించారు. ఇతరుల ఆత్మగౌరవాన్ని ఇబ్బంది పెట్టకూడదనేది దీని సారాంశముగా వివరించారు. విద్యార్థులు ర్యాగింగ్ అనే భూతానికి దూరంగా ఉండాలన్నారు. పక్క విద్యార్థికి, తోటి సహచరుడికి మాట చేతనైన, చేతల చేతనైన, చూపుల చేతనైన ఇబ్బంది కలిగేలా చేస్తే అది ర్యాగింగ్ కిందకు వస్తుందని పేర్కొన్నారు. తద్వారా ఆంధ్రప్రదేశ్ యాంటీ ర్యాగింగ్ చట్టం 1997 అనుసరించి పలు రకాల చర్యలు ఉంటాయన్నారు. ఇందులో జైలు శిక్షతోపాటు జరిమానాలు కూడా ఉంటాయని పేర్కొన్నారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ మాట్లాడుతూ వర్సిటీలో ఎటువంటి వివక్షత ఉండదని అది ఆర్థికంగా గాని, సామాజికంగా గాని, ఏ అంశంలోనైనా అటువంటి వాటికి తావు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ క్రమంలో గౌతమ బుద్ధ, బ్రూస్లీ జీవితాలను ఉదాహరణగా వివరించారు. నూతన విద్యార్థులు వారు చదువుకునే కోర్స్ తో పాటు దూరవిద్యలో మరొక కోర్సును చదువుకునే వెసులుబాటు ఇక్కడ ఉందని దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టర్ పి. వరప్రసాద మూర్తి మాట్లాడుతూ యూనివర్సిటీలో ఉన్న ఆరు కళాశాలల అభివృద్ధి నిరంతరం వేగంగా జరుగుతుందన్నారు. ఈ ఏడాది 15 వరకు నూతన కోర్సులను ప్రారంభించి విద్యా అవకాశాలను విస్తృతం చేస్తున్నట్లు వివరించారు. ర్యాగింగ్ జోలికి వెళ్ళొద్దని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఈ .శ్రీనివాస్ రెడ్డి , వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జాన్సన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రమీల రాణి, ఓ ఎస్ డి ప్రొఫెసర్ కే. సునీత మాట్లాడారు.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విద్యార్థులకు నిర్వహించిన ఇండక్షన్ కార్యక్రమంలో వర్సిటీ లోని డిపార్ట్మెంట్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ర్యాగింగ్ వల్ల జీవితంలో నాశనం అవుతాయని ర్యాగింగ్ లేని జీవితం ఎలా ఉంటుందో అనే అంశాలను ఈ సందర్భంగా వారు సంగీతం ద్వారా డాన్సుల ద్వారా డ్రామా ప్రదర్శనల ద్వారా తెలిపారు.







పలు పాఠశాలల్లో ముందస్తు దీపావళి



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

కెఎల్‌పిలో...

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు దీపావళి విశిష్టతను తెలియజేశారు. పర్యావరణహిత బాణసంచా మాత్రమే,తగిన జాగ్రత్తలతో కాల్చాలని సూచించారు.ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి మాట్లాడుతూ చెడుపై మంచి గెలవటానికి సూచికగా దీపావళి జరుపుకుంటామని తెలియజేశారు. నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ కె.బసవపున్నయ్య, ఏఒ కె.వెంకట్‌రావు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీ ఎస్ఆర్ఎంలో ...

కోలాహలంగా ఉద్యోగుల ఆటల పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



అమరావతి, నవంబరు 10 ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం ముందస్తు దీపావళి సంబరాలు మిన్నంటాయి. యూనివర్సిటీ మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో వివిధ క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ రకాల ఆటల పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు సందడి చేశారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరాతో పాటు డీన్లు, డైరెక్టర్లు, ప్రొఫెసర్లు ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాంప్ వాక్లో పాల్గొన్న వీసీ మనోజ్ కుమార్ అరోరా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ర్యాంప్ వాక్ లో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. పానీ పూరీలను ఆరగించే పోటీల్లో వందన, సందీప్లకు ప్రథమ బహుమతి లభించగా, హేమంత్, భానుప్రకాశ్‌కు ద్వితీయ బహుమతి లభించింది. బెలూన్ గ్లాస్ పోటీల్లో శైలజకు ప్రథమ బహుమతి లభించగా, రేవతి, సుస్మితలకు రెండో బహుమతి, పాసింగ్ బాల్ పోటీల్లో రేవతి, వై మాధురిలకు బహుమతులు లభించాయి. పురుషుల విభాగం పాసింగ్ బాల్ పోటీల్లో నాగరాజు, గౌతం లకు మొదటి రెండు బహుమతులు లభించాయి. ర్యాంప్ వాక్ పోటీల్లో శ్యాంకుమార్‌రెడ్డి, అరుంధతికు ప్రత్యేక బహుమతి లభించింది. ఈ పోటీలను హెచ్ ఆర్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ శివరంగన్ పర్యవేక్షించారు.

శ్రీపూజిత స్కూల్లో ...



ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక పట్టాభిపురంలోని శ్రీపూజిత పబ్లిక్ స్కూల్లో శుక్రవారం ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు నరకాసురుడి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.బాణసంచా కాలుస్తూ చిన్నారులు ఆనందంగా దీపావళి జరుపుకున్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి మాట్లాడుతూ దీపావళి గురించి విద్యార్థులకు వివరించారు.